
# దొంగ



## ద్విభాష్యం రాజేశ్వరరావు

**రకరకాల కంఠాలు! రకరకాల వ్యాఖ్యానాలు! బస్సు తలుపు దగ్గరకు వెళ్ళటమే గగనమయిపోయేలా వుంది. జనం వెనక్కి నెట్టేస్తున్నారు. సఫారీసూట్ నలిగి పోతుంది! చెమటతో ఒడలంతా చికాకుగా వుంది. అంతలోనే . . .**

ఎండ!

మండిపోతోంది! మండిస్తోంది!!

చెమటతో శరీరమంతా చిటపటలాడి పోతోంది.

తొడుక్కున్న సఫారీ సూట్ దళసరితనం మరింత చికాకును కల్గిస్తోంది. చేతిలోని బ్రీఫ్‌కేసు పక్కనబెట్టి సిగరెట్టు తీసి ముట్టించి ఇటూ అటూ పరికించేను.

బస్ కాంప్లెక్స్ అంతా పెళ్లి వారిల్లులా హడావుడిగానూ, పెద్దాపురం సంతలా గోలగోలగానూ వుంది. జనం కొంపలు మునిగిపోతున్నట్లు ఇటూ అటూ ఆదరాబాదరాగా పరుగు పెడుతున్నారు. కొంతమంది కొంపలు కాల్తావుంటే ఆర్పటానికి పరుగెత్తే వాళ్ళలా కాకుండా, వినోదం చూడటానికి వెళ్ళేవాళ్లలా తాపీగా అడుగులు వేస్తున్నారు.

ఎవరి గొడవ వాళ్ళది!

ఎవరి అవసరం వాళ్ళది!

ఎవరి హడావుడి వాళ్ళది!!

ప్లాట్‌ఫారం దగ్గరకు వచ్చి బస్సులు ఆగుతున్నాయి. ఆగిన బస్సులమీదకు జనం ఎగబడుతున్నారు. ఎగబడిన వాళ్ళలో సత్తువ కలవాళ్ళు బస్సుల్లోకి దూరుతున్నారు. జనాన్ని నింపుకున్న బస్సులు మత్తగజాల్లా కదిలివెళ్ళి పోతున్నాయి.

పరుగులు తీస్తున్న జనాన్నీ, కదిలిపోతున్న బస్సుల్నీ చూస్తూ నేలమీది బ్రీఫ్‌కేసు చేతిలోకి తీసుకున్నాను. అంతలోనే విజయనగరం వెళ్ళే నాన్‌స్టాపు బస్సు పెద్ద మోతతో వచ్చి ప్లాట్‌ఫారం దగ్గర ఆగింది.

అంతే! జనమంతా ఒక్కసారి శివమెత్తినట్లు బస్సు దగ్గరకు పరుగులు తీయడం మొదలుపెట్టేరు. బస్సులోపల పెళ్ళి కొడుకులా కూర్చున్న కండెక్టరు తలుపుతీసే ప్రయత్నం చేసాడు. తలుపు బయటకు తెరుచుకోటానికి కూడా సావకాశం ఇవ్వకుండా జనం బస్సుమీదకు ఎగబడ్డారు.

"మీరలా తోసుకుంటే నేను టికెట్టు కొయ్యను. తర్వాత మీ ఇష్టం!" అంటూ అరిచేడు కండక్టరు.

కానీ అతని మాటలు ఎవరూ పట్టించుకోలేదు.

ఈవేళ సాయంకాలం విజయనగరంలో అమ్మవారి తీర్థం! అందుకే కాబోలు ఈ రద్దీ అంతా... ఇలాటి రోజుల్లో మరి నాలుగు బస్సులు నడిపితే వాళ్ళ సొమ్మేం పోతుందో...." ఒక ముసలాయన నిస్పృహాయంగా నిలబడి బస్సువంక చూస్తూ అన్నాడు.

"ఇప్పటికే ఆర్.టి.సి నష్టాల్లో నడుస్తోందిట! మరి నాలుగు బస్సులు వేస్తే మరింత నష్టంతో నడుస్తుంది!" అంటూ ఒక యువకుడు చమత్కరించాడు.

బస్సు దగ్గర సుమారు వందమందికి పైగానే వున్నారు.

పెద్దా, చిన్నా, ఆడా, మగా, వయో బేధం లేకుండా వర్గ బేధం లేకుండా బస్సులో ఎక్కి సీటు సంపాదించాలనే ఆత్రంతో వున్నారు.

కండక్టరు కసురుతున్నాడు! బెదిరిస్తున్నాడు! అరుస్తున్నాడు! నానా హంగామా చేస్తున్నాడు!!

అయితే ఆ కసురులనూ, బెదిరింపులనూ, అరుపులనూ ఎవ్వరూ ఖాతరు చేయడంలేదు. తోసుకుంటూ, కుమ్ముకుంటూ బస్సులో దూరే ప్రయత్నం చేస్తున్నారు.

నేను కూడా బ్రీఫ్‌కేసుతో ముందుకు నడిచేను. చూస్తూ నిలబడితే లాభంలేదు!

రద్దీ తగ్గేక బస్సు ఎక్కాలనుకోవడం, 'కెరటాలు తగ్గేక సముద్రస్నానం చేయాలనుకోవడం లాంటిదే' అనిపించింది.

బలంతో నెట్టుకుంటూ జనంలోకి తోసుకువెళ్ళాను.

'ఏమిటండీ! అలా తోసేస్తారు?'

'ఆగవయ్యా నాయనా!... మేం కూడా ఎక్కాలికదా!'

'నా రుమాలు అలా ఆ కార్నరు సీటులో పడెయ్యండి!'

"ఆడ బొట్టిమీద పడిపోతావేటి... ఆ బోతువాగ... ఆ!... మరీ ముదనష్టపోళ్ళు తయారయ్యారు..."

"ఈ దేశం ఇక బాగుపడదు... క్యాపిస్టం లేకపోతే లాభం లేదు... మరీ ఘోరంగా వుంది..."

'అలా నొక్కెయ్యకండి... ఆడాళ్ళని చూసుకోరేం?'

'నా చెప్పు పడిపోయింది... ఒరే బాబిగా, చెప్పందుకో...'

'మనుషులే ఎక్కలేక చస్తావుంటే మధ్యలో ఈ కోళ్ళ గంపలేమిటమ్మా...'

'సూట్‌కేసు జాగ్రత్తరా... వెళ్ళేక ఉత్తరం రాయి...'

'జేబులు జాగ్రత్త బాబూ... ఇలాటి సమయంలోనే ఖాళీ అయిపోతాయి...'

'అసలే ముసలాణ్ణి! తోసెయ్యకండి మాబూ!'

రకరకాల కంఠాలు! రకరకాల వ్యాఖ్యానాలు!

బస్సు తలుపు దగ్గరకు వెళ్ళడమే గగనమయిపోయేలా వుంది. జనం వెనక్కి నెట్టేస్తున్నారు. సఫారీసూట్ నలిగిపోతోంది! చెమటతో ఒడలంతా చికాకుగా వుంది. అంతలోనే జనం మధ్యనుండి ఎవరో గొల్లుమన్నారు!

"బాబోయ్! నా పర్స్!... నా పర్స్!... ఎవరో కొట్టేసారు!" ఒక పిల్లచాక్కా పెద్ద మనిషి అరుస్తున్నాడు.

అంతే! జనంలో మరింత కలకలం రేగింది!

'పట్టుకోండి! ఈ గుంపులోనే వుంటాడు!'

'ఎంతసేపయింది సార్, పర్సుపోయి?'

'అందులో ఎంత వుంది?'

'అసలు పర్సు తెచ్చారా మీరు? గుర్తుకు తెచ్చుకోండి!'

ఈ స్టేండులో ఈ మధ్య దొంగతనాలు మరీ ఎక్కువయిపోయాయి.

జనంలో రకరకాల ప్రశ్నలు! ఓదార్పులు!



"నా పర్స్ బాబోయ్— పన్నెండువందల రూపాయలు వున్నాయి అందులో..." అంటూ శివ మెత్తిన వాడిలా చిందులు వేస్తున్నాడు సిల్కు చొక్కా పెద్దమనిషి. అంతలోనే— గుంపులో నుండి బయటకు గబగబా వెళ్ళిపోతున్న పదిహేనేళ్ళ కుర్రాడు నా కంట పడ్డాడు.

జనం కాళ్ల మధ్యనుండి వంగి బయటకు పారిపోయే ప్రయత్నం చేస్తున్నాడు.

"అరేయ్! ఆగు!" అంటూ వాడివంక ఉరికేను. నా అరుపు వినగానే జనం కూడా 'పట్టుకోండి!' అని అరుస్తూ వాడిమీద పడ్డారు. గభాలున వెళ్ళి వాడి చొక్కా కాలరు దొరకబుచ్చుకుని గుంపులో నుండి బయటకు ఈడ్చేనువాడిని!

వాడిమెడ గుంజుతూ నడ్డిమీద ఒక్క చరుపు చరిచేను!

"అమ్మోయ్! నాయనోయ్!" అంటూ ఏడుపు లంకించుకున్నాడు.

"పర్సు ఏదిరా? ఎక్కడ దాచేవ్?" అంటూ మరొకటి తగిలించేను.

"చెప్పరా లమ్డీకొడకా...." అంటూ డొక్కలో తన్నేరు ఎవరో!

అంతే! నలుగురూ నాలుగువైపుల నుండీ చావ బాదటం ఆరంభించారు.

"నాకు తెలీదు బాబోయ్! నేను దొంగను కాను బాబోయ్!" అంటూ గొల్లున ఏడవటం ఆరంభించేడు.

"మరీ అంతలా కొట్టకండి! చస్తే మళ్ళీ అదొక గొడవ!" అంటూ ఎవరో నా చెయ్యిపట్టి వెనక్కు లాగేరు.

"అంతలా తన్నినా నిజం చెప్పటం లేదు చూడండి!" అంటూన్నాడొక ముసలాయన.

"నాకేం తెలీదు.... నన్ను కొట్టకండి!" అంటూ ఎక్కిళ్ళ మధ్యలో అరుస్తూ, అరుపుల మధ్యలో ఎక్కిళ్ళు దిగమింగుతూ మోచేతులతో కళ్ళు ఒత్తుకుంటూ ఏడుస్తున్నాడు వాడు. వాటిని గుంపులోనుండి ఎడంగా బయటకు లాగి జేబులు సోదా చేసాను. కడుపు దగ్గర వెదికేను! పర్సులేదు!!

"పది నిమిషాల క్రితం స్వీట్లు కొన్నాను!... నల్లపర్సు... కానీ అర్థణాకాదు... పన్నెండు వందలుంది..." అంటూ పర్సు పోగొట్టుకున్న సిల్కు చొక్కా ఆయన ఏడుపు తక్కువగా ఎంతో దిగులుతో

చెప్తున్నాడు.

"స్వీటుస్టాలు దగ్గర పడిపోయిందేమో చూడండి...."

పడిపోతే మాత్రం ఇంకా అక్కడ కూర్చుంటుందా?

'పోలీసు రిపోర్టు ఇస్తే సరి!...'

'మళ్ళీ అదెందుకు?... వాళ్ళో నాలుగొందలు తినేస్తారు...'

ఆ కుర్రాడి దగ్గర పర్సు కనబడకపోయే సరికి జనంలో మళ్ళీ రకరకాల వ్యాఖ్యానాలు ఆరంభమయ్యాయి.

అంతలోనే—

విజయనగరం బస్సు మెల్లగా కదలటం ఆరంభించింది. కండెక్టరు తలుపులు మూసి బెల్ వాయిస్తున్నాడు. నేను ఆ కుర్రవాడిని వదిలి బస్సు దగ్గరకు పరుగెత్తుకుంటూ వచ్చాను.

"లాభం లేదుసార్! స్టాండింగ్ కూడా లేదు! రైట్... పోనీయ్!" అంటూ తలుపు మీద చేతులతో చరిచేడు కండక్టరు.

బస్సు కదిలి వెళ్ళిపోయింది. చేసేదిలేక నేను వెనక్కి వచ్చేసాను. జనమంతా మళ్ళీ బస్సు షెల్టరులోకి చేరుకుంటున్నారు.

పర్సు పోగొట్టుకున్న సిల్కుచొక్కా పెద్ద మనిషి స్వీటు స్టాలు వైపుకు వెళ్తున్నాడు.

ఈ సందట్లో ఎప్పుడు పారిపోయాడో ఏమో... ఆ కుర్రాడు కాస్తా తప్పించుకపోయాడు.

విజయనగరం వెళ్ళే తరవాతి బస్సు మళ్ళీ అరగంట వరకూ లేదు. దీర్ఘంగా నిట్టూర్పు వదలి బస్సు కాంప్లెక్స్ బయటకు వచ్చి పందగజాల అవతలవున్న కాఫీ హోటలుకు చేరుకున్నాను. కుర్చీలో కూలబడి రుమాలుతో ముఖం వత్తుకుంటూ కాఫీకి ఆర్డరిచ్చేను.

అంతలోనే—

స్టాండులో తన్నులు తిని పారిపోయిన కుర్రాడు బెదురుగా ఇటూ అటూ చూస్తూ మెల్లగా నడుచుకుంటూ నా దగ్గరకు వచ్చేడు!

వాడి ముఖమంతా కందిపోయివుంది!

చేతులు తట్లు తేలిపోయివున్నాయి!!

ఆ స్థితిలో వాడిని చూస్తే చాలా జాలి అనిపించింది.

మెల్లగా జేబులోంచి బరువయిన పర్సును బయటకు లాగి ఒకవంద రూపాయలనోటు తీసి వాడికి అందిస్తూ" ఇంక ఈ వేళ విజయనగరం వెళ్ళొద్దులే! మళ్ళీ ఆదివారం మధ్యాహ్నం మెయిలుకు రా! తుని వెళ్దాం!" అన్నాను.

'అలాగే' అన్నట్లు తల పంకించి వెళ్ళిపోయాడు వాడు.

ఈ వారం హాయిగా గడిచిపోతుంది! ఫర్వాలేదు!! జేబులో ఇంకా పదకొండు వందలున్నాయి!!! *



## ముగింపు

"మన ప్రేమకు ముగింపు చెప్పగోపీ" ఆర్ద్రతగా అడిగింది మల్లిక.

"నరకమే మల్లి" విషాదంగా చెప్పాడు.

"అదేంమాటా? పెళ్ళికాదా?"

"రెంటికీ పెద్ద తేడా ఏముందన్లే" బాధగా నవ్వి న్నాడు.

—ఎస్.రజనీ శకుంతల